క్లుప్తంగా

ఏటీఎం ఏర్పాటుకు స్థలం పరిశీలన

తిర్యాణి: మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం సహకార సంఘం అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 2025, జనవరి 10లోపు ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సహకార సంస్థ జిల్లా మేనేజర్ సూర్యప్రకాశ్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

మురళీగూడ రహదారికి శ్రమదానం



రోడ్డు చదును చేస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం నుంచి మురళీగూడ గ్రామానికి వెళ్లే రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడడంతో మంగళవారం గ్రామస్తులు శ్రమదానంతో సుమారు 3కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు వేయాలని, రోడ్డుపైన ఏర్పడిన గుంతలను పూడ్చాలని పలుమార్లు వినతిపత్రాలు అందించినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గ్రామస్తులు కలిసి చందాలను పోగు చేసి రోడ్డుకు మరమ్మతులు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తలండి మధుకర్, ప్రభాకర్, జగదీష్, రామయ్య, గురుదాస్, యువకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోచమ్మ గుడి సమీపంలోని ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీని వల్ల కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాలనీకి చెందిన అన్నాజి, ఉమేందర్, గంగయ్య, గణేశ్, నాందేవ్, కాలనీవాసులు ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీసీఆర్‌బీ సీఐ కేశవ్ అన్నారు. మంగళవారం బెజ్జూర్ ఎస్సై కె.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో కళాజాత బృందం ద్వారా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాజాత బృందం సిబ్బంది రోహిత్, రామచందర్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత, సంగవి, కానిస్టేబుల్ వెంకటేశ్, నవీన్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు శంకర్, గోపాల్, రమేశ్, రంగయ్య, నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

'317 జీవోతో ఉపాధ్యాయులకు అన్యాయం'

చింతలమానెపల్లి: రాష్ట్రంలో జీవో 317 జీవోతో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ 317 జీవోపై సబ్ కమిటీ వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌గౌడ్, రాకేశ్, ఉపాధ్యాయులు సచిన్, రవికుమార్, బారికరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

కౌటాల: పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు ఎదకు రాని పశువులకు, గర్భకోశ వ్యాధి బారిన పడిన పశువులకు చూడి పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి అంజలి, సిబ్బంది రమేశ్, భిక్షపతి, ప్రకాశ్, సత్యనారాయణ, శోభన్, రైతులు పాల్గొన్నారు.

పల్లెల్లో క్రీడల సందడి!

- అట్టహాసంగా సీఎం కప్ పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 పోటీలతో పల్లెల్లో క్రీడల సందడి నెలకొంది. ఈ నెల 7న గ్రామస్థాయి పోటీలు నిర్వహించగా.. మంగళ, బుధవారాల్లో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పోటీలు క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించాయి. – కౌటాల



క్రీడలను తిలకిస్తున్న అభిమానులు

పోటీలతో స్నేహభావం



మా ప్రాంతంలో మొదటిసారి సీఎంకప్ పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. మండలస్థాయి కబడ్డీ పోటీల సందర్భంగా కౌటాలలో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. అందరితో కలిసి పోటీలను ఆస్వాదించాం.

– అక్షయ్, వీర్దండి

పోటాపోటీగా..



మండలస్థాయి పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించిన కబడ్డీ పోటీలకు ప్రేక్షకులు భారీగా వచ్చారు. పోటీల సందర్భంగా వారిచ్చిన మద్దతుతో పోటీ పడి పాల్గొన్నాం. మాకు వచ్చిన మద్దతు క్రీడలపై ఉన్న ఆదరణ ఆనందాన్నిచ్చింది.

– అనికేత్, పార్డీ

పల్లెల్లో పండుగ



సీఎంకప్ పోటీలతో గ్రామస్థాయి, మండలస్థాయి పోటీలతో సందడి నెలకొంది. పోటీలకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో క్రీడామైదానం నిండిపోయింది. ఓడినా, గెలిచినా ఈ పోటీలు గుర్తుండిపోతాయి.

– రాంబాబు, పార్డీ

కబడ్డీ అంటే ఇష్టం



గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ఆడే ఏకైక ఆట కబడ్డీ. కబడ్డీ ఆట అంటే చిన్నప్పటి నుంచే చాలా ఇష్టం. కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చడమే లక్ష్యం. సీఎం కప్ పోటీల్లో పాల్గొనడంతో ఒత్తిడిని జయించి ఎలా ఆడాలో అర్థమైంది.

– రాజేశ్, కౌటాల

సీఎం కప్ క్రీడలు..

లింగాపూర్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మంగళవారం సీఎం కప్ ఆటల పోటీలను ఎస్సై గంగన్న, సూపరింటెండెంట్ రామచందర్ ప్రారంభించారు. యువకులు పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మొదటి రోజు వాలీబాల్ క్రీడలు ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీవో రజనీ కాంత్, ఉపాధ్యాయుడు యువరాజ్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి పోటీలను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎస్సై కొమురయ్యలతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లను జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి, పీఈటీ నాగరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని మోడి, హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సీఎం కప్ క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ ఆటలు ఆడారు. క్రీడలను ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నర్సయ్య, పంచపుల, ఆత్రం లక్ష్మణ్ ఉన్నారు.

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, గ్రామీణ ప్రాంత యువకులు సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసి ప్రపంచస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

రెబ్బెన: గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మలు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో బుధవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో మీనారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మండలస్థాయి పోటీలో పాల్గొనాలని సూచించారు.

వాంకిడి: మండల కేంద్రంలో గురువారం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మైదానాన్ని తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంఈవో శివచరణ్‌లతో కలిసి పరిశీలించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కెరమెరి: స్టోర్‌రూం పరిశీలిస్తున్న ఎంపీడీవో



పెంచికల్‌పేట్: వంట గది పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మండలంలోని బాబేఝరి ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వంటగదులను, స్టోర్ రూంలో ఉన్న వంట సరుకులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వంట గదుల్లో శుభ్రత పాటించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయులు తినాలని, ఆ తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. సరుకుల్లో నాణ్యత పాటించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని తయారు చేసి ఇవ్వాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎంలు జంగు తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అంతకు ముందు వంట గది పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి హెచ్‌ఎంయాదగిరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ అధికారుల సమావేశం నిర్వహించారు. ఏరియాలోని గనులు, అన్ని విభాగాల అధికారులు, అధిపతులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్‌లో లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీవో నరేందర్, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కాపర్ వైరు పట్టుకున్న సిబ్బంది



పట్టుకున్న కాపర్‌వైరు, సామగ్రితో సిబ్బంది

రెబ్బెన: చోరీకి గురై తుక్కు దుకాణానికి చేరుకున్న సింగరేణికి చెందిన కాపర్ వైరుతో పాటు ఇనుప సామగ్రిని సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా బోయపల్లిలోని తుక్కు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. సింగరేణి సంస్థకు చెందిన కాపర్ కేబుల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి కాపర్ వైరు తీసి తుక్కు దుకాణంలో విక్రయించగా ఎస్‌అండ్ పీసీ సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో బయటపడింది. సోదాల్లో 170 కిలోల కాపర్‌వైరుతో పాటు 5 క్వింటాళ్ల ఇనుప సామగ్రి రికవరీ చేశారు. పట్టుబడిన సామగ్రి విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, శంకర్, వెంకటేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పెంచికల్‌పేట్: తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పులు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంలో కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పులు చేసి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, నాయకులు రాంప్రసాద్, బండి మహేశ్, రాజవర్ధన్, గోపాల్, రవి, మొండి, గంగన్న, తిరుపతి, విజయ్, తోగయ్య, రాజన్న, కిష్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకంతో పాటు పంచామృతాలతో అభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి తెలంగాణ స్ఫూర్తిని అవమానించిందన్నారు. పార్టీ గోలేటి పట్టణ ఇన్‌చార్జి పంబాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుమలత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనజ, నాయకులు నరేందర్, ఆసిఫ్, లక్ష్మణ్, వినోద్, వెంకటేశ్, రవి, దయాకర్ పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అసెంబ్లీ కో కన్వీనర్, సమన్వయకర్త కొండ రాంప్రసాద్ , మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరవడిన పర్యవేక్షణ..!

- నెలరోజులుగా అంగన్‌వాడీ సెంటర్‌కు రాని టీచర్
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

బెజ్జూర్: మాతా శిశు మరణాలను తగ్గించడమే కాకుండా బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తూ వారి సంపూర్ణ ఆరోగ్యానికి అండగా నిలవాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. బెజ్జూర్ మండలం మర్తిడి అంగన్‌వాడీ కేంద్రం –2కు చెందిన టీచర్ దాదాపు గత నెలరోజులుగా కేంద్రానికి రాకున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమి పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సెంటర్ పరిధిలో 6 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు పిల్లలు దాదాపు 30 మంది, 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 20 మంది, గర్భిణీలు 4, బాలింతలు ముగ్గురు చొప్పున ఉన్నారు. వీరికి ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం పెట్టాల్సి ఉంటుంది. అలాగే చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో చదువు నేర్పించాల్సి ఉండగా అవేమి జరగడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రానికి దూరం..

మండలంలోని మర్తిడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ గత నెలరోజులుగా విధులకు గైర్హాజరు కావడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు కేంద్రానికి రాలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రం కొనసాగించాల్సి ఉంటుంది. టీచర్ అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు సెంటర్‌కు రాలేని పరిస్థితి నెలకొంది. ఇన్నిరోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడం, సేవలు నిలిచిపోయినా సంబంధిత అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని సెంటర్‌లో సేవలు అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

టీచర్ ఎటు వెళ్లారో..

మర్తిడి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ముడిమడుగుల విజయలక్ష్మి గత నెల రోజులుగా విధులకు దూరంగా ఉన్నారు. సంబంధిత శాఖ అధికారులకు కూడా ఎలాంటి సమాచారం అందించలేదు. దీంతో ప్రతిరోజు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు కేంద్రానికి వచ్చి వెనుదిరుగుతున్నారు. పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

అందని సరుకులు..

అంగన్‌వాడీ టీచర్ అందుబాటులో లేకపోవడంతో ఆ సెంటర్ పరిధిలో గల బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారం సరుకులు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సూపర్‌వైజర్ కరుణరెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

చెక్కులు పంపిణీ

బెజ్జూర్: మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన గోనె బిక్కయ్యకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ అందజేశారు. మండల మాజీ అధ్యక్షుడు జాడి దిగంబర్, మాజీ ఎంపీటీసీ తాల్ల ఇంద్ర రామయ్య, మాజీ సర్పంచ్ వసీఉల్లా ఖాన్, బీజేపీ నాయకులు సామల తిరుపతి, పురుషోత్తం పాల్గొన్నారు.

108 సేవలు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలానికి నూతనంగా 108 వాహనం మంజూరైంది. ఈమేరకు మండలంలో సేవలను ప్రారంభించారు. అధికారులు నూతన 108 వాహనంతో పాటు ఆరుగురు సిబ్బందిని నియమించారు. మంగళవారం ఈఎంటీ శ్రీనివాస్, సాగర్‌లు మాట్లాడుతూ 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో పాటు పైలట్ సాయిప్రసాద్ ఉన్నారు.

నిబద్ధతతో పని చేయాలి

రెబ్బెన: కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో కొత్తగా ఉద్యోగంలో చేరే యువతీ, యువకులు నిబద్ధతతో పని చేసి సంస్థ ఎదుగుదల కోసం కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఆవరణలో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఏడుగురు ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. జీఎం మాట్లాడుతూ విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

వాంకిడి: బాల్య వివాహాలను నిర్మూలించడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 ఏళ్లు, అబ్బాయి వయస్సు 21 ఏళ్లు ఉండాలన్నారు. నిర్దేశిత వయస్సులోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, పెళ్లి చేసినా రూ.లక్ష జరిమానాతో పాటు మూడేళ్ల జైలుశిక్ష ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో మహిళలకు విధిగా అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీవో రెబ్కా, సూపర్‌వైజర్‌లు లత, కుమారి, భారతి, చైల్డ్‌హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ దుర్గం పితాంబర్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా క్రాస్‌రోడ్ వద్ద సోమవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించగా ఐచర్‌వ్యాన్‌లో తరలిస్తున్న 48.5 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నామన్నారు. వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ మహమ్మద్ అఫ్జల్, యజమాని అవేస్, బియ్యం కొనుగోలు చేస్తున్న మహారాష్ట్రలోని అన్నూర్‌కు చెందిన ప్రకాశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో సేఫ్టీ అధికారిగా పని చేసి శ్రీరాంపూర్ ఏరియా టింబర్ యార్డు ఇన్‌చార్జిగా బదిలీపై వెళ్తున్న రాజేశ్వర్‌రావును మంగళవారం గోలేటిలో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. జీఎం మాట్లాడుతూ ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగుల రక్షణ కోసం సేఫ్టీ అధికారి అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, ఫిట్ ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్, సంక్షేమ అధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంఈవోకు..



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిర్యాణి: మండల ఎంఈవోగా పని చేసి కాసిపేట మండలానికి బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర స్వామికి ఉపాధ్యాయులు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈవో వెంకటేశ్వర స్వామి, బదిలీపై వెళ్లిన ఇతర ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తిర్యాణి, కన్నెపల్లి ఎంఈవోలు అంజయ్య, సెడమకె రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏవోకు..



ఏవో మనీషాను సన్మానిస్తున్న సభ్యులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని సంజీవ్‌నగర్ రామాలయంలో మంగళవారం పెంచికల్‌పేట్ ఏవో మనీషాను ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఘణపురం సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రావుల కృష్ణ, భాస్కర్, రమేశ్, నరేందర్, కృష్ణ, రాజు, రామన్న, నగేష్, హరికృష్ణ, వెంకటేశ్, వెంకన్న, వినోద్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సందీప్, మహిళలు పాల్గొన్నారు.